క్లుప్తంగా

పశువుల మార్కెట్‌ను వేరే ప్రాంతంలోకి మార్చాలి



మార్కెటింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: బబ్బుగూడ పశువుల మార్కెట్ మూలంగా ఆ ప్రాంతంలోని వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అన్నారు. దీనిని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆదివారం తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా కబేలాల్లో క్రయ, విక్రయాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. సంబంధిత వెటర్నరీ డాక్టర్లు ఇష్టానుసారంగా సర్టిఫైడ్ చేసి సర్టిఫికెట్లు ఇస్తుంటంతో వెటర్నరీ డైరెక్టర్ రామచంద్రకు కూడా వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. స్పందించిన లక్ష్మీబాయి వేరొక ప్రాంతం చూసిన వెంటనే ఇక్కడి నుంచి మార్కెట్‌ను తప్పకుండా తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ గోరక్ష ప్రముఖ్ రమేష్, వెంకటేష్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తండ్రి రాంచందర్ గౌడ్ ఇటీవల పరమపదించారు. ఈ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, నాయకుల గొట్టిముక్కల పెద్ద భాస్కర్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు పరామర్శించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో అమావాస్య పూజలు



ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ పూజలో మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారయణ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజల్లో కోతిమీర్ అశోక్, రమేష్, నర్సింగ్, నర్సింగ్‌రావు, చిన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న సంజీవరెడ్డి, పెద్ద భాస్కర్‌రావు, మాధవరం రంగారావు

ఆల్విన్‌కాలనీ: కమల ప్రసన్ననగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పరమిత ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరమిత ఆస్పత్రి వారు నిర్వహించిన ఈ కార్యక్రమం కాలనీలో ఉన్న ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ వారు కాలనీ సభ్యుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకొని ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు వారిని అభినందిస్తున్నామని తెలిపారు.

ఫలించిన ప్రొ.అన్సారీ పోరాటం

ఎట్టకేలకు నో డ్యూస్ సర్టిఫికెట్ జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ గత ఐదు నెలలుగా నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. ఉద్యోగ విరమణ అనంతరం పని చేసేచోట ఎలాంటి బాకీ (నోడ్యూస్) లేదని సర్టిఫికెట్ తీసుకొని పాలన భవనంలో సమర్పిస్తేనే రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ లభిస్తాయి. కానీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయం నుంచి సకాలంలో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వనందున వరసగా దీక్షలు చేపట్టి అధికారులపై ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు నోడ్యూస్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రొ.అన్సారీ మాట్లాడుతూ..తన పోరాటానికి మద్దతు తెలిపిన మీడియా, విద్యార్థి నేతలు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలియుగ భగీరథుడు మన కేసీఆర్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఘనంగా మంచినీళ్ల పండగ



మంచినీళ్ల పండగ ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేపీహెచ్‌బీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం మంచినీళ్ల పండగ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 90ఏళ్లుగా పరిష్కారం కాని పనులను కేవలం 9ఏళ్ల కాలంలో పూర్తి చేశామన్నారు. ఒకప్పుడు ఎగతాళి చేసిన వారే ముక్కున వేలేసుకునేటట్లు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీరు ఇస్తామన్న మాట ప్రకారం నేడు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేస్తోందని గుర్తు చేశారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి..

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో నీటి ఎద్దడి లేకుండా, లక్షల గ్యాలన్ల నీటి ట్యాంక్‌లు నిర్మించామన్నారు. 270 కిలోమీటర్‌ల నుంచి కాళేశ్వరం నుంచి మహానగరానికి తీసుకొచ్చి ప్రజల గొంతు తడుపుతున్న కలియుగ భగీరథుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. ఇంత కష్టపడి నీటిని తీసుకు రావటానికి 1 లీటరుకు 60 రూపాయల ఖర్చు అవుతోందన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. అదే విధంగా నీటి విభాగం అధికారులు ఎంతో కృషి చేస్తూ ఎటువంటి ఇబ్బందులు వచ్చిన పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రదాన అధికారి దాన కిషోర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు.

నీటి ఎద్దడి పోయింది..

◆ ఒకప్పుడు మహిళలు మంచినీటి కోసం ఎంతో ఇబ్బందులు పడేవారని నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎంతోమంది మంత్రులు, ముఖ్యమంత్రులుగా చేసిన పరిష్కారం కాని నల్గొండ ఫ్లోరైడ్ సమస్య నేడు ఎందుకు పరిష్కారం అయ్యిందో ఆలోచించుకోవాలని తెలిపారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

◆ ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను సత్కరించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష, సబిహా బేగం, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, సంతోష్, నీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ మహాసభ

24గంటల విద్యుత్ అందిస్తున్నాం: ఎమ్మెల్యే

ఎర్రగడ్డ గార్డెన్‌లో మెజిస్టిక్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ 10వ మహాసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలిన్ కంపెనీలో ఒకప్పుడు తాను కార్మికుడిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అప్పటి అనుభవాలను పంచుకున్నారు. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ అందిస్తూ పరిశ్రమలు నిరంతరాయంగా నడిపిస్తూ కార్మికులకు అండగా నిలిచారన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తనను సంప్రదిస్తే త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, లింగాల ఐలయ్య, పిల్లి తిరుపతి, కొడల్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.



మహాసభను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి

ఆ బాధ్యత కార్పొరేటర్లదే: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో చేసుకున్నటువంటి శంకుస్థాపన పనులన్నీ ఆగస్టు నెలకల్లా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా పెండింగ్ పనులు ఉండే కార్పొరేటర్లు పాదయాత్ర నిర్వహించి తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అందుకు సంబంధించిన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 95 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

◆ అదే విధంగా తొమ్మిదేళ్ల కాలంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో 9 ఏళ్ల కాలంలో అన్ని రంగాల్లో ప్రగతి సాధించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ఎన్నుకొని తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచపటంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, మనవడు మృతి



రేణుక (ఫైల్)



భరత్ (ఫైల్)

బాలానగర్: ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో అమ్మమ్మ, మనవడు మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామానికి చెందిన ఆకుల శ్రీను తన కుటుంబ సభ్యులను కలిసి ఇంద్రానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇదే కాలనీలో అతని కూతురు, అల్లుడు కూడా నివాసం ఉంటున్నారు. కాగా ఈ నెల 17న రాత్రి ఆకుల శ్రీను భార్య ఆకుల రేణుక (42), మనవడు భరత్ (6)ను ఎత్తుకొని వెంకటేశ్వరనగర్ కాలనీలో నుంచి రోడ్డు దాటుతోంది. బాలానగర్ నుంచి కూకట్‌పల్లికి ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బైక్ వారిని ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. అదే రాత్రి చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. మెరుగైన వైద్యం కోసం భరత్‌ను నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆ బాలుడు సైతం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరి మృతికి కారణమైన అనిరుధ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి వ్యాపారం చేస్తున్న వారిని ఆదివారం కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర సొసైటీ, కాముని ఎరువు సమీపంలో ఎండు గంజాయి వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పంజుదేకా (43), చందానగర్‌లో నివాసముంటున్న నందిగంటి శ్రీనివాస్ (55)లు సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి వ్యాపారం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గంజాయి విక్రయిస్తున్న పంజుదేకా, ప్రసాద్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30వేల విలువ చేసే 900 గ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఎండుగంజాయి

ఓయూలో రేపు తెలంగాణ ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రేపు (20న) తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. క్యాంపస్‌లోని వివిధ కాలేజీల నుంచి డాక్టర్. జి నాగయ్య ఓపెన్ ఎయిర్ ఎంపి థి యేటర్ వరకు తెలంగాణ మార్నింగ్ వాక్ చేపట్టనున్నారు. ఆయా కాలేజీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వి ద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను ని ర్వహించి సాయంత్రం ఓపెన్ థియేటర్‌లో జరి గే సాంస్కృతిక కార్యక్రమాలలో బహుమతులు అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పథకాలను నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్‌లో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... అసంఘటిత రంగానికి చెందిన భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం లేకపోవడంతో వారి కుటుంబాలు ఎంతో నష్టపోతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు తెలియకపోవడంతో చాలా మంది కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు అండగా నిలవాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వీర నాగప్ప, సర్కిల్ అధ్యక్షులు బాలాజీ, సలహాదారులు మమ్మద్ ఖాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున మొక్కలు నాటాలి

- గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి
- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ కోరారు. జిల్లా వ్యాప్తంగా 61 గ్రామాలు, 13 పురపాలక సంఘాలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అలాగే, నర్సరీలను సందర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పారిశ్రామిక వాడల్లో తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని హరితోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారన్నారు. గ్రీన్ కవర్ పెంచడంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్న విషయాన్ని పేర్కొనాలన్నారు. నాటిన మొక్కల వాటి వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి చూపించాలని, దీంతో వారిలోనూ మొక్కలు నాటాలనే సానుకూల ఆలోచన వస్తుందన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టిన టిప్పర్

పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు



టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమైన విగ్రహం

జగద్గిరిగుట్ట: నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తూ ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 5.30గంటల సమయంలో డ్రైవర్ షాబాద్ హుస్సేన్ తన టిప్పర్‌ను నడుపుకుంటూ ఆల్విన్‌కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వైపు వెళ్తున్నాడు. బస్టాప్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టాడు. దీంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమయ్యింది. ఈ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు ఫిర్యాదు చేశారు.

సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు మార్గదర్శకంగా ఉండాలి

సుభాష్‌నగర్: దేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు మార్గదర్శకంగా ఉండాలని సూరారం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సూరారం కాలనీ శ్రీవాసవీ ఆర్యవైశ్య భవనంలో ఆదివారం ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి చేపట్టారు. సిఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు చక్కటి క్రమశిక్షణ నేర్పించి సమాజంలో మార్పు కోసం కృషి చేయాలన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కృష్ణమోహన్, ఎస్‌ఐ రామ్‌రెడ్డి, రమేష్ కుమార్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 73వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఓయూలో ఆవిష్కరించారు. ఆదివారం ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి, అధ్యక్షులు హకీమ్ నవీద్, జాతీయ ఉపాధ్యక్షులు గొల్లపల్లి రాజుగౌడ్ తదితరుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

మోతీనగర్ అభివృద్ధికి కృషి చేస్తాం



మోతీనగర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ సర్వసభ్య సమావేశంలో కమిటీ సభ్యులు

మోతీనగర్: మోతీనగర్ అభివృద్ధి కోసం మోతీనగర్ కో–ఆపరేటివ్ లిమిటెడ్ నిరంతరం కృషి చేస్తుందని ఎంసీహెచ్‌ఎస్ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో మోతీనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ప్రధాన కార్యదర్శి కేబీ రామకృష్ణ అధ్యక్షత జరిగింది. అందులో 12 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అందులో ముఖ్యంగా సీసీ కెమెరాలు, షటిల్ కోర్టు నిర్మాణం, షాపింగ్ ప్లేస్ పై అదనపు అంతస్తు, కమ్యూనిటీహాల్ మెయింటెనెన్స్, పెయింట్స్, రిపేరింగ్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు పాలక కమిటి వారు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జి.వెంకటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, హనుమంతరావు గౌడ్, శ్రీదేవి, ఎస్.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలనచిత్ర వాణిజ్యమండలి కార్యవర్గ సభ్యుడిగా పాండురంగారావు



కూకట్‌పల్లి: తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి ఎన్నికల్లో కూకట్‌పల్లికి చెందిన గొట్టిముక్కల పాండురంగారావు కార్యవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా సునీల్ నారంగ్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, వాసుదేవరావు చౌదరి, ప్రధాన కార్యదర్శిగా అనుపమ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బాల గోవింద్ రాజ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రావు ఎన్నికయ్యారు. కూకట్‌పల్లి ప్రాంతం నుంచి తొలిసారిగా తెలంగాణ ఫిల్మ్ చాంబర్ కామర్స్‌లో కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక కావడంపై పలువురు సీనీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతోషంతో అభినందనలు తెలిపారు.

చెరువుల కబ్జాలను త్వరలో బయట పెడతాం

జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు



హస్మత్‌పేట బోయిన్ చెరువు వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో పార్టీ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 రోజు పాటు సాగిన ఇంటింటికీ బీజేపీ పాదయాత్రతో ఇతర పార్టీల్లో వణుకు మొదలైందన్నారు. అనంతరం హస్మత్‌పేట బోయిన్ చెరువు దగ్గర డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి మాట్లాడారు.

కమీషన్ లేనిదే ఫలాలు అందడం లేదు..

చెరువుల కాబ్జాలకు సంబంధించిన అధారాలు ఉన్నాయని త్వరలో బయట పెడతామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలలో అవినీతి రాజ్యం ఏలుతోందని విమర్శించారు. కమీషన్లు లేనిదే లబ్ధిదారులకు ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల ఏర్పాట్లలో కుంభకోణం జరుగుతోందన్నారు. ప్రజా దర్బార్ నిర్వహిస్తే ప్రజల ఇబ్బందులు తెలుస్తాయని అన్నారు. గడప గడపకు తిరుగుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరెంత భయపెట్టినా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.

100 ఎకరాల ఆర్‌అండ్‌బీ స్థలంలో డబుల్ ఇళ్లు ఎందుకు నిర్మించరు?

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఓడించే దిశగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయో ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని.. అవినీతికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై చర్యలు ఉంటాయని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. కేబీహెచ్‌బీ కాలనీలో ఆర్‌అండ్‌బీకి సంబంధించిన 100 ఎకరాల ఖాళీ స్థలం ఉందని... వాటిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టిస్తే 15వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. మరి ఆ స్థలంలో ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మందు పార్టీలను జరుపుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతియాదవ్, నాయకులు రవికుమార్‌గౌడ్, సత్యమూర్తి, వేణుగోపాల్‌రెడ్డి, జగదీష్, అంజీ, సందిప్, దకయ్య, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.